క్లుప్తంగా

క్రికెట్ టీమ్‌కు టీ షర్ట్‌ల పంపిణీ



టీమ్ సభ్యులకు టీ-షర్టులు అందజేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డుకు చెందిన స్కైలార్క్ క్రికెట్ టీమ్‌కు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు సోమవారం టీ-షర్టులు పంపిణీ చేశారు. ఏబీసీ క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీమ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మశాస్త సేవాపీఠం వార్షికోత్సవం



పీఠంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

పద్మనాభం: మండల పరిధి మద్దిలోని శ్రీ ధర్మశాస్త సేవా పీఠం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంలో విశేష పూజలు జరిగాయి. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పీఠాన్ని దర్శించి, పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయ భవనం ప్రారంభం



రెడ్డిపల్లిలో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో రూ.2.05 కోట్లతో నిర్మించిన కస్తూర్బా విద్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. పద్మనాభంలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్వ శిక్షా అభియాన్ జీసీడీవో కలేషా బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపీపీ కె.లీలావతి, నాయకులు రమణ, నగేష్ కుమార్, ఎంఈవోలు రమణ, బాబూలాల్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

తగరపువలస: ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృంద ప్రతినిధులు సోమవారం సందర్శించారు. ప్రజలకు వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని వైద్య ఆరోగ్యశాఖ కేర్ క్యాంపెయిన్ పథకం సూర సంస్థ కేంద్ర ప్రతినిధులు సుదర్శన్, దివ్య అన్నారు. వేములవలస, బోని విలేజ్ క్లినిక్‌లను సందర్శించిన వారు వివిధ రకాల వ్యాధులు సోకినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ఎం.గంగునాయుడు, కేర్ క్యాంపెయిన్ ఉమ్మడి జిల్లా కన్సల్టెంట్‌లు డాక్టర్ మేఘన సలేంద్ర, డాక్టర్ జయభార్గవి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, సీహెచ్‌వోలు సూర్యకళ, జశ్వంత్, బాలాజీ, ఉమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన టీచర్లు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పట్నాయక్ మాట్లాడుతూ ప్రాణవాయువు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

నిత్యం నిరీక్షణే..!

● భోగాపురం వైపు వెల్లే ప్రయాణికులు ● ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఆపకపోవడంతో పడిగాపులు ● సిటీబస్సులు నడపాలంటూ విజ్ఞాపనలు



శ్రీకాకుళం మార్గంలో వెళ్లాలంటే ఆటోలే గతి



బైపాస్ రోడ్డులో వెంకటేశ్వర మెట్ట వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



విజయనగరం వైపు వెళ్తున్న సిటీ సర్వీస్

తగరపువలస: విశాఖ నుంచి తగరపువలస, భోగాపురం మీదుగా శ్రీకాకుళం వరకు సిటీ బస్సులు నడపాలని భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం విశాఖ-శ్రీకాకుళం మధ్య నడుస్తున్న పల్లె వెలుగు బస్సులు ప్రయాణికుల అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతున్నాయి. అలాగే తగరపువలస మీదుగా శ్రీకాకుళం వైపు నడిచే ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ స్టేజీలు లేవని చెపుతూ ప్రయాణికులను వదిలేసి, ఖాళీగా వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదకరమైనా ఆటోలు, క్యాబ్‌లను.. ఖర్చు ఎక్కువైనా ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది.

ప్రస్తుతం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, కూర్మన్నపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంట్‌ల నుంచి 111, 211, 411 నంబర్లతో పదుల సంఖ్యలో సిటీ బస్సులు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ వరకు నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లపై ఆధారపడకుండా సిటీ బస్సుల్లో సాఫీగా ప్రయాణాలు సాగిస్తున్నారు. అదే విధంగా నగరం నుంచి శ్రీకాకుళం వరకు సుమారు వంద కిలోమీటర్ల మేర సిటీ బస్సులు నడిపితే పలువర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు.

పారిశ్రామిక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు: భోగాపురం మార్గంలో శ్రీకాకుళం వరకు ఉన్న పుణ్యక్షేత్రాలకు, సంతలకు, సీ ఫుడ్, ఫార్మా, పారిశ్రామిక ప్రాంతాలకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. తీరప్రాంతం కావడంతో వేలాది మంది మత్స్యకారులు ఈ మార్గాన్నే ఎన్నుకుంటారు. ఈ మార్గంలో పనిచేసే వివిధ డిపార్ట్‌మెంట్‌ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు మారుమూల గ్రామాలకు చేరుకోవడానికి నిత్యం షెల్టర్లు లేని హైవేపై వివిధ రవాణా సాధనాల కోసం తంటాలు పడుతూనే ఉంటారు. ముఖ్యంగా సవరవిల్లి, నాతవలస, పేరాపురం, కందివలస, పైడి భీమవరం, రణస్థలం, బుడుమూరు, సుభద్రాపురం, చిలకపాలెం సంతలతో పాటు పూసపాటిరేగ నుంచి పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు, ఇతర వస్తూత్పత్తి సంస్థలు, గొడౌన్‌లు ఉన్నాయి. భోగాపురం విమానాశ్రయ పనులు పూర్తయితే ఈ మార్గానికి అధిక ప్రాధాన్యం పెరగనుంది. అంతేకాకుండా గోవిందపురం, చింతపల్లి, కోనాడ వంటి పర్యాటక ప్రదేశాలు, కుమిలి, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం వంటి ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాలు ఇటువైపు ఉన్నాయి. అనుకూలమైన రవాణా సాధనాలు లేకపోవడంతోనే ఈ ప్రాంతం వెనుకబడి ఉండిపోయింది. ఈ మార్గంలో సిటీ బస్సులను ప్రవేశపెడితే అభివృద్ధికి ఊతం లభిస్తుందని అంటున్నారు.

అందరికీ ఉపయోగం



తగరపువలసను ఆనుకుని భోగాపురం మండలం చాలావరకు ఉంది. ఆ మండల ప్రజలు రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్, పోలీస్ స్టేషన్ తదితర అవసరాలకు తగరపువలస నుంచే భోగాపురం వెళ్లవలసి ఉంటుంది. ఆ ప్రాంత విద్యార్థులు కూడా విద్యాభ్యాసం కోసం ఎక్కువగా భీమిలి వైపే వస్తుంటారు. అందువలన ఈ మార్గంలో సిటీ బస్సులు నడిపితే అందరికీ ఉపయోగం.

– బల్ల వెంకటరావు, టైప్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు, చిట్టివలస

ఎక్కువ మంది శ్రీకాకుళం వైపే..



తగరపువలస నుంచి వివిధ పుణ్యక్షేత్రాల సందర్శన, సంతలు, వ్యాపారాలు, ఉద్యోగాల నిమిత్తం శ్రీకాకుళం వైపే వెళ్తుంటారు. కానీ సరిపడినన్ని బస్సులు లేవు. ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రతి ఊరిలో ఆగడం లేదు. సొంతంగా వాహనాలు కట్టించుకుని వెళ్లాలంటే భారంగా ఉంటోంది.

– చిల్ల సూర్యనారాయణరెడ్డి, చెరకుపల్లి

ఉద్యోగస్తులకు నిత్యం అవస్థలే..



ప్రస్తుతం విశాఖ-శ్రీకాకుళం నుంచి సరిపడినన్ని పల్లె వెలుగు బస్సులు లేవు. ఉన్న బస్సులు నిత్యం రద్దీగా ఉంటాయి. ముఖ్యంగా ఈ మార్గంలో ఉద్యోగం చేసేవారు రవాణా సాధనాలు లేక రోజూ ఇబ్బందులు పడుతున్నారు. సిటీ సర్వీసులు వేస్తే ఉపశమనం కలుగుతుంది.

– మాదాబత్తుల శంకర్‌కుమార్, తగరపువలస

పకడ్బందీగా నైపుణ్య గణన



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) పకడ్బందీగా చేయాలని ఎంపీడీవో ఎస్.హనుమంతరావు ఆదేశించారు. వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారు, వారి విద్యార్హతలు ఏమేరకు ఉన్నాయి అన్న అంశాలతో పాటు ఉద్యోగాలు చేస్తుంటే ఏ ఉద్యోగాలు చేస్తున్నారు, వృత్తులు, ఇతర వివరాలను సేకరించాలని సూచించారు. దీనివల్ల అవసరమైన వారికి త్వరలో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఎంతో జాగ్రత్తగా ఈ సర్వేను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి శిక్షణ

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పంచాయితీ కార్యదర్శులు, సిబ్బందికి స్కిల్ సెన్సస్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, స్కిల్ డెవలప్‌మెంట్ అసోసియేట్ మేనేజర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు దాక్షాయణి



ఇజ్జాడ దాక్షాయణి

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఇజ్జాడ దాక్షాయణి అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 2న కణితి జెడ్పీ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఈమె అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, తాటితూరు పంచాయతీ వాసులు దాక్షాయణిని అభినందించారు.

రామాలయ భూమి అమ్మకంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న కొమ్మాది గ్రామ పెద్దలు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం కొమ్మాది రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 84లో 31 సెంట్లు శ్రీరాముడి ఆలయ భూమిని కొందరు వ్యక్తులు విక్రయాలు చేపట్టడంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతూ కొమ్మాది గ్రామ పెద్దలు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పీజీఆర్ఎస్‌లో దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ దేవుడు భూమిని అప్పనంగా కొట్టేయడానికి చూస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. వర్ధిరాజు కృష్ణవేణి అనే ఆసామి పేరుతో పోతిన వెంకటరావు, సుధాకర్ రెడ్డి మధ్యవర్తులుగా వ్యవహరించి ఉప్పలపాటి సౌమ్య, ఎస్.పృథ్వీరాజ్ అనే వారికి పెదగంట్యాడ రిజిస్ట్రార్ ఆఫీసులో రెండు జీపీఏలు చేయించారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయించి దేవుడి భూమిని పరిరక్షించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామ పెద్దలు గుంటబోయిన శ్రీనివాస్ యాదవ్, గొలగాని సన్యాసిరావు, బైపిల్లి మధు, సియాద్రి కనకరాజు, బెవర పైడిరాజు, గుంటబోయిన కిషోర్, బైపిల్లి కిరణ్, సన్యాసిరావు ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు 100 వినతులు

● గృహనిర్మాణ శాఖకు అధికంగా 80 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వంద వినతులు వచ్చాయి. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీడీవో ఎం.విజయ కుమార్, తహసీల్దార్ కె.ఆనందరావు ఈ వినతులు స్వీకరించారు. ఇందులో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి అత్యధికంగా 80 అర్జీలు రాగా, పంచాయతీరాజ్‌కు ఏడు, ఇరిగేషన్‌కు మూడు, ఏపీఈపీడీసీఎల్, ఆర్‌అండ్‌బీ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున, రెవెన్యూ శాఖకు ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి.

అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

అన్నదాత సుఖీభవ పథకం తమకు వర్తింపజేయాలని కోరుతూ కృష్ణాపురం ఇనాం భూముల రైతులు వినతి పత్రం ఇచ్చారు. ఈ పథకం పొందడానికి 1బీ ఉండాలని ప్రభుత్వం నిబంధన విధించిందని అధికారులకు విన్నవించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమకు 1బీలు లేకపోయినా రైతు భరోసా ఇచ్చిందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

వ్యాపారమ్మ ఆలయానికి రోడ్డు వేయాలి

కొవ్వాడలోని వ్యాపారమ్మ ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు పలువురు వినతి పత్రం ఇచ్చారు.

శ్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలకు వినతి

భీమునిపట్నం: మత్స్యకారులు ఎంతో పవిత్రంగా భావించే శ్మశాన వాటిక ప్రాంతాన్ని ఆక్రమిస్తున్న వ్యక్తిపై చర్యలను తీసుకోవాలని ఇక్కడి మత్స్యకారులకు సంబంధించిన ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు సోమవారం జోనల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జెడ్సీ ప్రేమ ప్రసన్న వాణికి వినతి పత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

జోన్-2లో 13 దరఖాస్తులు

మధురవాడ: మధురవాడలోని జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 13 అర్జీలు అందాయి. జెడ్సీ సింహాచలం వినతులను స్వీకరించి, వాటిని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నగరం పాలెం రోడ్డులో గెడ్డను ఆనుకుని, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాన్ని నిలిపివేయించాలని జెడ్సీ సింహాచలం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీని ఆదేశించారు. సదరు నిర్మాణంపై తనకు చాలా ఫిర్యాదులు వచ్చాయన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసేంత వరకు నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని చెప్పారు.

- హైవే నుంచి నగరంపాలెం రోడ్డులో స్తంభాలకు వీధిలైట్లు వేయాలని సీపీఐ నాయకులు సత్యనారాయణ తదితరులు వినతి ఇచ్చారు.
- కొమ్మాది ఏపీహెచ్‌బీ కాలనీలో రోడ్లు పాడైపోయాయని, చర్యలు చేపట్టాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సురేష్ తదితరులు కోరారు.

జోన్-2లో పలువురు అధికారుల బాధ్యతల స్వీకరణ

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2లో పలువురు అధికారులు సోమవారం జెడ్సీ సింహాచలం, సూపరింటెండెంట్ అప్పలరాజు సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీవో వరప్రసాద్ పలాస బదిలీ కావడంతో ఆయన స్థానంలో జి.బాలరాజు బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం నుంచి బదిలీపై వచ్చారు.

- మధురవాడ జోన్‌లో డీఈగా పనిచేసిన వంశీకి పార్వతీపురం బదిలీ కావడంతో ఆయన స్థానంలో జోన్-8 నుంచి వచ్చిన ఎస్.అప్పారావు బాధ్యతలు చేపట్టారు. ఈయన 10 నుంచి 13 వార్డులు చూస్తారు. ఏఈ వెంకటరావుకు డీఈ బాధ్యతలు అప్పగించగా, ఆయన జీవీఎంసీ 5 నుంచి 9 వరకు గల వార్డులు చూస్తారు.
- ఇక్కడ పనిచేసిన ఏఈ సురేష్‌కు భీమిలి జోన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయనగరం నుంచి బదిలీపై వచ్చిన ఏఈ శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు.

ఆకట్టుకున్న దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసలో పార్వతీపరమేశ్వరుల(గౌరీ పూజ) పూజా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం రాత్రి మండపం వద్ద చేపట్టిన దీపారాధన ఆకట్టుకుంది. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి

ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు



సిద్ధేశ్వర స్వామి ఆలయంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



చిట్టివలస శివాలయంలో క్షీరాభిషేకం



రామాద్రిలో శివయ్యకు పూజలు



చోడేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు



జ్యూట్‌మిల్లు శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజలకు విశేషంగా హాజరైన భక్తులు

కొమ్మాది: పంచాక్షరి ప్రతిధ్వనులతో శివాలయాలు మార్మోగాయి. కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు శివాలయాలకు పోటెత్తారు. స్థానిక కొమ్మాది అన్నంరాజునగర్‌లోని మంగళగౌరి సమేత వైశాఖేశ్వరస్వామి ఆలయంలో, హంసవన పుణ్యక్షేత్రం రామాద్రి శివాలయంలో, ఎండాడ శివాలయంలో శివయ్యకు వేకువ జాము నుండే పూజలు చేశారు.

భీమునిపట్నం: చోడేశ్వర, భ్రమరాంబిక ఆలయంలో వేకువజాము మూడు గంటల నుంచే భక్తుల రాక మొదలైంది. మధ్యాహ్నం వరకు దర్శనాలు, ప్రత్యేక పూజలు కొనసాగాయి.

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలో కొలువుదీరిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో, ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు.

తగరపువలస: గోస్తని నది చుట్టూ ఉన్న పురాతన శివాలయాలైన సంగివలస ఉమా రామలింగేశ్వర ఆలయం, తాటితూరు ఉత్తర రామలింగేశ్వర ఆలయంతో పాటు బంగ్లామెట్ట, వలందపేట, చిట్టివలస, కొండపేట, ఆమనాం,చిట్టీల అగ్రహారం, లక్ష్మీపురం, సంత పేట శివాలయాలు భక్తుల క్యూలైన్లతో నిండిపోయాయి.

మహాదేవుడికి రుద్రాభిషేకం

పీఎం పాలెం: కారుషెడ్ శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సామూహిక అభిషేకాలు అర్చనలు చేశారు. శృంగేరి శంకరమఠంలో వెలసిన శివాలయంలో భక్తులు అధిక సంఖ్యల్లో పూజల్లో పాల్గొన్నారు.



ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కారుషెడ్ శివాలయంలో అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే గంటా స్పందించాలి

తగరపువలస: భీమిలి జోన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు డిమాండ్ చేశారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో సోమవారం జరిగిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్టివలసలో రైతుబజారును వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రయాణికులకు బస్ షెల్టర్లు, ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విస్తరణ చేపట్టాలన్నారు. ఫిల్టర్ చేసిన తాగునీరు సరఫరా చేయాలని, చిట్టివలస శ్మశానవాటికలలో స్నానఘాట్‌లు శుభ్రం చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. నాయకులంతా ఈ సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, కాసూరి రాంబాబు, అల్లు బాబూరావు, సన్నిబాబు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ సమస్య పరిష్కరించాలి

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం-బక్కన్నపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన రేవళ్లపాలెం వాసుల టీడీఆర్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు పిళ్లా రమణ, వాండ్రాసి సూరి అప్పారావు, బి. నర్సింగరావు, బాపూజీ తదితరులు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. బాధితులైన 33మందికి టీడీఆర్‌తో పాటు కనీసం టిడ్కో ఇళ్లు ఇప్పించాలని కోరారు. ఇందులో పలువురు గ్రామ పెద్దలు, బాధితులు పాల్గొన్నారు.

రుషికొండ ప్యాలెస్‌ను మ్యూజియంగా మార్చాలి

మహారాణిపేట: రుషికొండ ప్యాలెస్‌ని మ్యూజియంగా మార్చాలని సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మీడియాతో మాట్లాడుతూ ఆ కట్టడాలను మన రాష్ట్ర మ్యూజియంగా వినియోగించాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తరువాత రావలసిన శిల్ప, కళా ఖండాలు, విశాఖలో దొరికిన బుద్ధుని అవశేషాలు(హైదరాబాద్‌లో ఉన్నవి) ఇక్కడకు తీసుకు రావలసి ఉందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.మల్లయ్య రాజు, భారత నాస్తిక సమాజం నాయకులు జె.రవి తదితరులు పాల్గొన్నారు.

'ఉమ్మడి ఆస్తులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

తగరపువలస: ఉమ్మడి ఆస్తుల పంపకాల్లో తనకు, తన కుమార్తెలు శైలజ, సంధ్యలకు తమ కుటుంబ సభ్యులు అన్యాయం చేశారని ఆనందపురం మండలం పాలవలసకు చెందిన మద్ది శివ అనే మహిళ ఆరోపించారు. దీనిపై తహసీల్దార్, కలెక్టర్లకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. తమ అత్తామామలు సూరీడు, సీతయ్యమ్మలకు ముగ్గురు కుమారులని తెలిపారు. వారిలో తన భర్త అప్పలనారాయణ, మరిది నరసింగరావు చనిపోయారన్నారు. తమకు ఉన్న ఉమ్మడి ఆస్తి 4 ఎకరాల 70 సెంట్లు గతంలోనే పంపిణీ చేసుకోవడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వం ల్యాండ్‌పూలింగ్‌లో ఈ స్థలాన్ని తీసుకుని ప్రతిఫలంగా 22 ప్లాట్లతో కూడిన 4227 చదరపు గజాలు ముగ్గురికీ ఇచ్చిందన్నారు. ఇందులో తమకు రావలసిన వాటా 1409 గజాలు ఇవ్వకుండా తన బావ లక్ష్మినాయుడు, ఆయన కుమారుడు శేఖర్, చిన్న తోటికోడలు నాగమణి తమపేరున తీసుకున్నారన్నారు. తనతో పాటు తన పిల్లలకు గజం స్థలం ఇవ్వకుండా టీడీపీ నాయకులతో బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేసి, ఉమ్మడి ఆస్తి ఉన్న సర్వే నంబర్లు 56/2, 59/1, 59/3, 80/1, 82 వద్ద నిరసన వ్యక్తం చేశారు.